ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
ఆదివారం 6 అక్టోబరు 2024



నేటి అలంకారం
శ్రీలలితా త్రిపురసుందరీ దేవి





అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు





మాంపాహి మాతాన్నపూర్ణేశ్వరి

పరమేశ్వరుడికే అన్నప్రసాదాన్ని భిక్షగా పెట్టిన జగన్మాతను అన్నపూర్ణాదేవి అలంకారంలో చూసి అశేష భక్తకోటి తన్మయత్వం పొందింది. కిలోమీటర్లకొద్దీ నడిచి అమ్మ దర్శనంతో పునీతమైన భక్తులు.. ఆనక అన్నప్రసాదాన్ని స్వీకరించి ధన్యులయ్యారు. భక్తుల జయజయధ్వానాలు.. కుంకుమార్చనల్లో ఉభయదాతల మంత్రోచ్ఛారణలు.. సువాసినీ పూజల్లో బాలికల వేదమంత్రాలు.. ఇలా ఇంద్రకీలాద్రిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించింది. ఉత్తరాంధ్ర భక్తుల రాకతో అమ్మ నామస్మరణలు అంబరాన్ని తాకుతున్నాయి.



కుంకుమపూజలో దంపతులు



దుర్గాఘాట్‌లో నవహారతులు



కనకదుర్గానగర్‌లో నగరోత్సవం

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భక్తులు

అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మ దర్శనం • అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తజనం • ఉత్తరాంధ్ర నుంచి భక్తుల రాక ప్రారంభం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో శనివారం దుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చింది. తెల్లవారుజాము నుంచి క్యూలు కాస్తంత పలచగా కనిపించినా, ఉదయం 10 గంటలు దాటాక భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. వీఐపీ దర్శనాలు అరగంటలో పూర్తవుతుంటే, సామాన్య భక్తులకు నాలుగైదు గంటల సమయం పడుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తుల రాక మొదలైంది. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. శనివారం వారే ఎక్కువగా కనిపించారు. అమ్మవారిని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి దర్శించుకున్నారు. మహామండపంలోని ఆరో అంతస్థులో రెండు విడతలుగా కుంకుమార్చనలు నిర్వహించారు. మొదటి విడతలో 82 మంది, రెండో విడతలో 75 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ద్వారకాతిరుమల ఆలయ ఛైర్మన్ కుటుంబ సభ్యులు, ఈవో మూర్తి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గడిచిన ఏడాది కంటే ఈ ఏడాది అమ్మవారికి ఇచ్చే కానుకల సంఖ్య పెరిగింది. కాగా, మోడల్ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు ఆలయ ప్రాంగణం మొత్తాన్ని నిత్యం పరిశీలిస్తున్నారు. ఏమైనా లోటుపాట్లు కనిపించినప్పుడు వైర్‌లెస్ సెట్‌లో ఆదేశాలు ఇస్తున్నారు.





బంగారు సూత్రాలు, వెండిహంస

దుర్గమ్మకు భక్తుల కానుకలు

వన్‌టౌన్, అక్టోబరు 5 : ప్రకాశం జిల్లా కొండేపికి చెందిన ఓ చిరు వ్యాపారి అంకురయ్య దుర్గమ్మకు రూ.18 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాలను కానుకగా ఇచ్చారు. శనివారం అంకురయ్య, రాజేశ్వరి కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి ఈవో రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు. దాతలకు దర్శనం చేయించి, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, ఆశీస్సులు ఇచ్చారు. గుంటూరుకు చెందిన చేబ్రోలు పుల్లయ్య, ఆయన కుటుంబ సభ్యులు దుర్గమ్మకు వెండిహంసను కానుకగా ఇచ్చారు. ఈవో రామారావుకు అందజేశారు. వారికి కూడా దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు ఇచ్చారు.

మట్కా కింగ్



హీరో వరుణ్‌తేజ్ శనివారం నగరంలో సందడి చేశారు. 'మట్కా' చిత్రం టీజర్‌ను గాంధీనగర్‌లోని రాజ్ యువరాజ్ థియేటర్‌లో విడుదల చేశారు. దర్శకుడు కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు. - ధర్నాచౌక్

హద్దు దాటి..



మళ్లీ పోలవరం మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు

నగరానికి చెందిన ఎమ్మెల్యే అనుచరులమంటూ హడావిడి

- మరో నియోజకవర్గ పరిధిలో తవ్వకాలు
- తమ పరిధిలో తవ్వకాలు జరపొద్దన్న అక్కడి ఎమ్మెల్యే
- టీడీపీ చోటా నాయకులతో వైసీపీ నేతల కుమ్మక్కు
- తెరపైన వారిని పెట్టి అడ్డగోలు తవ్వకాలు

కొండపల్లి.. గుబ్బలగుట్ట.. చిలకలబీడు కొండ.. పోలవరం కాల్వకట్టలు.. వైసీపీ హయాంలో వేటినీ వదలకుండా తవ్వి సొమ్ము చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు, పోలవరం మట్టి తరలింపునకు అడ్డుకట్ట పడుతుందని అంతా భావించారు. కానీ, తెరపైన నాయకులు మారారే తప్ప అక్రమ తవ్వకాలు మాత్రం ఆగలేదు. పైగా అధికార పార్టీ ఎమ్మెల్యేల నడుమ గ్రావెల్, మట్టి తవ్వ కాలు సరిహద్దు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పోలవరం కొండలు.. గుట్టలు.. కుడికాల్వ కట్టలను ఆ పార్టీ నేతలు కరిగించేశారు. విచ్చలవిడిగా తవ్వి సొమ్ము చేసుకున్నారు. తాజాగా మళ్లీ మట్టి, గ్రావెల్ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. విజయవాడ నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు ఇటీవల విజయవాడ రూరల్‌లో గ్రావెల్ తవ్వకాలతో పాటు పోలవరం కట్టలను తవ్వడం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో తవ్విన వైసీపీ నేతలే తాజాగా కొందరు స్థానిక టీడీపీ నాయకులను తెరముందుంచి, ఎమ్మెల్యేల పేరు చెబుతూ పోలవరం కట్టలను తవ్వుకుంటుండటం గమనార్హం. వారు తవ్వుతున్న ప్రాంతం వేరే నియోజకవర్గ ఎమ్మెల్యే పరిధిలో ఉండటంతో ఈ విషయం ఆయనకు తెలిసింది. దీంతో తనకు చెడ్డపేరు వస్తుందన్న ఉద్దేశంతో ఆగమేఘాలపై ఆయన అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. అధికారులను పంపి అనుమతులు ఉన్నాయో లేవో తెలుసుకుని, లేకుంటే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అక్కడకు వెళ్లిన అధికారులకు ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసి రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ విషయం తెలియడంతో అధికార పార్టీకి చెందిన స్థానిక చోటా నాయకులు రంగంలోకి దిగారు. తమ ఎమ్మెల్యే తవ్వకోమంటే ఆపడానికి మీరెవరంటూ అధికారులపై వీరంగమాడారు. అక్కడికి వచ్చిన పోలీసులతో మీపై అధికారి నా స్నేహితుడే ఆయనతో మాట్లాడతాను.. మీ సంగతి తేలుస్తానంటూ రెచ్చిపోయారు.

మళ్లీ అదే ప్రాంతంలో..

విజయవాడ రూరల్ పరిధిలోని పాతపాడులో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చిలకలబీడు కొండ, జానకమ్మ కుంట రక్షిత అటవీ ప్రాంతం కింద ఉన్నాయి. అటవీ సర్వే నెంబరు 309, 310, 311ల్లో విస్తరించి ఉన్న ఈ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫారెస్ట్ సర్వేర్లాళ్లను మాయంచేసి మరీ తవ్వకాలు చేశారు. మళ్లీ ఇదే ప్రాంతంలో తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఎవరైతే తవ్వారో అదే వైసీపీ నాయకులు చోటా టీడీపీ నాయకులను తెరముందు పెట్టి ఈ తవ్వకాలు ప్రారంభించారు.

- విజయవాడ రూరల్ మండలం వేమవరం గ్రామంలోని సర్వే నెంబర్లు 147, 148ల్లో పదుల ఎకరాల్లో వైసీపీ హయాంలో 20 నుంచి 40 అడుగుల లోతున గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. సర్వే నెంబర్ 147/6లో అయితే ఏకంగా సుమారు ఎకరం విస్తీర్ణంలో 20 అడుగుల లోతున భారీ గుంతలు కనిపిస్తుంటాయి. మళ్లీ ఇదే గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు జోరందుకున్నాయి.

- విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు, తాడేపల్లి, వేమవరం గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగినట్టు గతంలో విజిలెన్స్ బృందం నిర్ధారించింది. 2023, డిసెంబరులో ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ బృందం అక్రమ తవ్వకాలు జరిగినట్లు పేర్కొంది. అప్పటి వైసీపీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు ఇక్కడ తవ్వకాల్లో కీలకపాత్ర పోషించారు. మళ్లీ కొద్ది రోజులుగా ఇక్కడ తవ్వకాలు మొదలయ్యాయి. గతంలో విజిలెన్స్ నివేదికలో ఎవరి పేర్లయితే ప్రస్తావించారో వారే మళ్లీ ప్రస్తుత తవ్వకాల్లో కీలకపాత్ర పోషిస్తుండటం గమనార్హం.

అంతరాలయ దర్శనం ఆగదా..?

- అనధికారికంగా సాగుతున్న దర్శనాలు
- రూ.500 టికెట్ కొన్నవారికి అవస్థలు
- ముందుకు కదలని క్యూ.. పడిగాపులు
- భక్తుల్లో అసహనం.. సిబ్బందితో ఘర్షణ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/చిట్టినగర్) : 'శరన్నవరాత్రుల్లో ఎవరికీ అంతరాలయ దర్శనం ఉండదు. నవరాత్రులు ముగిసే వరకు అంతరాలయ దర్శనాలను రద్దు చేస్తున్నాం.' దసరా ఉత్సవాలకు అధికారులు చేసిన ప్రకటన ఇది. ఈ ప్రకటనకు ఇంద్రకీలాద్రిపై అర్థమే మారిపోయింది. అనధికారికంగా అంతరాలయ దర్శనాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అన్ని శాఖలకు ఈ దర్శనాలు కల్పిస్తున్నారు. ఈ దర్శనాల కారణంగా రూ.500 క్యూలో ఉన్న భక్తులు ఇబ్బందులు - మిగతా 6లో

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

ఇద్దరు యువకుల దుర్మరణం.. మరో బాలుడికి స్వల్ప గాయాలు.. వెల్లంకిలో విషాదఛాయలు

6లో

ఎంత నష్టమొచ్చినా చార్జీలు పెంచబోం..

ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల బాధ్యతల స్వీకారం

- ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



కొనకళ్లను అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, నటుడు సుమన్

బస్‌స్టేషన్, అక్టోబరు 5 : ఆర్టీసీకి ఎంత నష్టమొచ్చినా చార్జీలు పెంచకుండా సేవలందిస్తామని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు హామీ ఇచ్చారు. పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలోని ఆర్టీసీ హౌస్‌లో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. 30 ఏళ్లుగా తాను ఆర్టీసీ సంఘాలకు గౌరవాధ్యక్షుడిగా ఉన్నానని, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా చూశానని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన వైద్యం అందిస్తానని తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, సులువైన రవాణా సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొంచెం ఆలస్యమైనా పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా గుర్తింపు వస్తుందన్నారు. ఇందుకు తానే నిదర్శనమని చెప్పారు. సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేందుకు కృషిచేస్తానన్నారు. ఉద్యోగులు ఎంత ముఖ్యమో, ప్రయాణికులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా త్వరలో మరిన్ని కొత్త బస్సులు ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెస్తామని, చార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ఖర్చులు తగ్గించేందుకు ప్రయత్నిస్తామన్నారు. మిగతా రాష్ట్రాల్లోని ఆర్టీసీలతో పోలిస్తే 92 శాతం బస్సులతో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంగా ఉందన్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు, కార్గోను విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని కొనకళ్ల పేర్కొన్నారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఆయన నూతన ఇంద్ర బస్సులను ప్రారంభించారు. తొలుత కొనకళ్ల నారాయణరావుకు ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి స్వాగతం పలికారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవివర్మ, చంద్రశేఖర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నటుడు సమన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. అద్దె బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి, సంఘం సభ్యులు, ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు.



అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జయహో.. జగన్మాత

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ.. అమ్మవారి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

దసరా మహోత్సవాల్లో మూడో రోజైన శనివారం ఇంద్రకీలాద్రిపై అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జయహో..జగన్మాత అంటూ ఉప్పొంగిన భక్తిభావంతో నినదించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



కిటకిటలాడుతున్న క్యూలైన్లు



హారతి అందుకుంటున్న భక్తులు



అంతరాలయంలో భక్తుల రద్దీ



దసరా ఉత్సవాల్లో ఏర్పాట్లపై

మీ అభిప్రాయం ఏంటి?

- భక్తుల ఆలోచన తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఫీడ్‌బ్యాక్ యాప్
- అందుబాటులోకి తేవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం వినూత్న ఆలోచన చేసింది. కలెక్టర్ సృజన ఇందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను తీసుకురావాలని నిర్ణయించారు. శనివారం కొండపైన ఏర్పాట్లను పర్యవేక్షించాక దేవస్థానం అధికారులతో తన మనసులోని ఆలోచనను కలెక్టర్ వెల్లడించారు. ఎన్‌ఐసీ టీమ్ ద్వారా యుద్ధ ప్రాతిపదికన ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆలయ పరిసరాలు, కొండదిగువన, క్యూలైన్లలో ప్రచారం యాప్‌పై కల్పిస్తారు. అమ్మను దర్శించుకున్న భక్తులు ఎలా ఫీల్ అవుతున్నారు? సౌకర్యాలు ఎలా ఉన్నాయి? ఎక్కడైనా అసౌకర్యం కలిగిందా? నిర్వహణ మరింత మెరుగు పరుచుకోవటానికి రద్దీని క్రమబద్ధీకరించటానికి ఇచ్చే సూచన ఏంటి? మూలానక్షత్రం రోజున ఎలాంటి ఏర్పాట్లు ఉండాలని కోరుకుంటున్నారు? శాఖలన్నీ సమన్వయంగా చేయాల్సిన పనులేమైనా ఉన్నాయా? క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఇంకా ఏ సౌకర్యాలు కల్పించాలి? కొండ దిగువన ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి? లడ్డూ ప్రసాదాల నాణ్యత ఎలా ఉంది? అనే ప్రశ్నలను పొందుపరిచి భక్తులు నుంచి నేరుగా సమాధానాలు రాబట్టేలా యాప్‌ను రూపొందిస్తున్నారు. భక్తులు సొంతంగా ఏదైనా ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలనుకున్నా దానికీ అవకాశం కల్పించాలని నిర్ణయించారు. యాప్‌ను రేపటిలోగా తీసుకొచ్చే అవకాశం ఉంది. సలహాలు, సూచనలను అనుసరించి జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ యంత్రాంగం, దేవస్థానం, పోలీసు యంత్రాంగాలు చర్యలు తీసుకోనున్నారు.

కనరో.. భాగ్యము!

ఇంద్రకీలాద్రి దిగి పతీసమేతంగా భక్తుల చెంతకు అమ్మవారు





పల్లకిపై ఊరేగుతున్న ఆది దంపతులు

తిరుమల మాడవీధుల తరహాలో..ఆది దంపతుల నగరోత్సవం

ఉత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం కనకదుర్గానగర్ వీధుల్లో మేళతాళాలు, నృత్యాలు, కోలాటాలతో అట్టహాసంగా ఊరేగింపు

తిరుమల బ్రహోత్సవాల్లో మాడవీధుల్లో స్వామి ఊరేగింపు తరహాలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోనూ దసరా మహోత్సవాల్లో ఆదిదంపతుల నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దుర్గా మల్లేశ్వరులను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్ల నుంచి నడుచు కుంటూ ఇంద్రకీలాద్రికి చేరుకునే భక్తులు, క్యూలలో కాలినడకన వచ్చే భక్తులకు సాంత్వన కలిగించడానికి ఆదిదంపతులే కొండ దిగి కిందకు వచ్చి రోజూ సాయంత్రం భక్తులకు దర్శనం ఇవ్వటం ఈ నగరోత్సవం ప్రత్యేకత...కానీ, ఈ కార్యక్రమానికి దేవస్థానం అధికారులు తగిన ప్రచారాన్ని కల్పించలేకపోయారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /వన్‌టౌన్):
నగరోత్సవాన్ని నిర్వహించే ముందు దుర్గామల్లేశ్వర దేవస్థానం అధికారులు, వేద పండితులు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సంప్రదించారు. అక్కడి వేద పండితులతో చర్చించాక గంగా, పార్వతీ సమేత పరమేశ్వరుడు (ఆది దంపతుల)ను ఊరేగిస్తూ నగరోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. 2016 దసరా ఉత్సవాల సందర్భంగా తలపెట్టిన ఈ నగరో త్సవం ఎనిమిదేళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగుతూ వస్తోంది.

నగరోత్సవం నిర్వహణ ఇలా..

ఇంద్రకీలాద్రి దిగువన శివాలయం మెట్ల దిగువ నుంచి కనకదుర్గానగర్ మీదుగా ఘాట్ రోడ్డుపై నుంచి తిరిగి సన్నిధి వరకు ఈ నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆరుగంటలకు రెండు కిలోమీటర్ల మేర గంటసేపు నగరోత్సవాన్ని నిర్వహిస్తారు. మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి గంగా పార్వతీ సమేత పరమేశ్వరుల ఉత్సవమూర్తులను బయటకు తీసుకొచ్చి అలంకరించి పల్లకీపై ఉంచి మేళతాళాలు, సంప్రదాయ నృత్యాల మధ్యన అట్టహాసంగా ఊరేగిస్తారు. ఈ నగరోత్సవం వెంట అర్చకులు, దేవస్థాన సిబ్బంది, వైదికులు, కళాకారులు నడుస్తూ కొండమీదకు చేరుకుంటారు. పల్లకీని బోయీలూ కొండమీద వరకు మోస్తారు. కేరళకు చెందిన మేళం బృందం అగ్రపధాన ఉంటుంది. దేవస్థాన సంప్రదాయ మేళం ఆ తర్వాత కొనసాగుతుంది. కేరళకు చెందిన సంప్రదాయ కళాకారులు నృత్య విన్యాస బృందం నగరోత్సవాన్ని అనుసరిస్తుంది. ఒళ్లు గగుర్పొడిచేలా కళాకారులు విన్యాసాలు ప్రదర్శిస్తారు. ఘాట్ మార్గంలోకి చేరుకున్న తర్వాత క్యూలలో ఉన్న భక్తులు ఆదిదంపతులను దర్శించుకుంటారు.

నేటి నుంచి 30 వేల మంది

భక్తులకు పాలు, మజ్జిగ అందిస్తాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

లబ్బీపేట, పటమట: "దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆదివారం నుంచి 30వేల మంది భక్తులకు పాలు, మజ్జిగ అందిస్తాం. భక్తుల రద్దీ మేరకు లడ్డూలు అందుబాటులో ఉంచుతాం." అని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. సామాన్య భక్తులకు సాఫీగా అమ్మవారి దర్శనమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం 18వేల మందికి అన్నప్రసాదం అందించామని తెలిపారు. కనకదుర్గా సౌందర్య లహరి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

సామాన్య భక్తులకు సాఫీ దర్శనమే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, అక్టోబరు 5: సామాన్య భక్తులకు సాఫీ దర్శనం కల్పించడమే తమ లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. దుర్గగుడి మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. దర్శనానికి వచ్చే వీఐపీలు తమకు నిర్దేశించిన సమయాల్లోనే రావాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు వీఐపీల దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు. అదే సమయాల్లో వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. నిర్దేశించిన సమయాల్లో కాకుండా ముందుగా గాని తర్వాత గాని వస్తే 500 రూపాయల క్యూలో పంపుతామన్నారు.

యూనిఫాంలో దర్శనాలకు వెళ్లొద్దు: సీపీ రాజశేఖరబాబు

'క్యూ పద్ధతి పాటించకుండా దర్శనాలకు వచ్చే భక్తులను నియంత్రిస్తున్నాం. పోలీసు యూనిఫాంలో దర్శనాలకు వెళ్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించాం. రూ.500 దర్శనం ఆలస్యమవుతోంది. రూ.300 క్యూ వేగంగా కదులుతోంది. వీఐపీలకు టైం స్లాట్ ఇచ్చాం. కొంత ఇబ్బంది కలిగినా వారు అర్థం చేసుకోవాలి. సామాన్యులకు దర్శనం ఇబ్బందులు లేకుండా చేయాలన్న ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అస్త్రం యాప్‌ను ఉపయోగిస్తున్నాం. ఇప్పటివరకు లక్ష మందికి సైబర్ అవగాహన యాప్‌ను డౌన్‌లోడ్ చేశాం.' అని సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

లక్ష దాటిన భక్తులు : ఈవో కేఎస్ రామారావు

'ఇప్పటి వరకు అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య లక్ష దాటింది. తొలి రోజున 49 వేల మంది, రెండో రోజున 65వేల మంది, శనివారం మధ్యాహ్నం వరకు 36వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. మూలా నక్షత్రం రోజున భారీగా భక్తులు వస్తారని అంచనా వేశాం. రెండు రోజుల్లో మొత్తం 28వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశాం. 3952 మంది తలనీలాలు సమర్పించారు. 1,39,906 లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. ఈసారి లడ్డూలను ఒక ప్యాకెట్‌గా ఇస్తున్నాం. ఆరు లడ్డూలను ప్యాకెట్‌గా చేసి కౌంటర్లలో అందుబాటులో ఉంచాం.' అని ఈవో రామారావు తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుకున్నా

- ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు



రఘురామకృష్ణంరాజుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

వన్‌టౌన్: రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, అందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజలపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు తెలిపారు. శనివారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. తర్వాత మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఐదేళ్లలో అమ్మవారిని దర్శించుకోలేకపోయానన్నారు. జగన్మాత అనుగ్రహంతో ఇప్పుడు సాధ్యమైందన్నారు.

కనకదుర్గమ్మకు రూ.45.43 లక్షల ఆదాయం

వన్‌టౌన్: దసరా మహోత్సవాల్లో మూడో రోజైన శనివారం సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన ఆదాయ వివరాలను దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తంగా రూ.45,43,253 ఆదాయం వచ్చింది. రూ.500 రుసుము టికెట్లను 3,848 భక్తులు తీసుకోగా రూ.19.24 లక్షలు, రూ.300 టికెట్లను 1,733 మంది భక్తులు కొనుగోలు చేయగా రూ.5.19 లక్షలు, రూ.100 టికెట్ల ద్వారా 4.19 లక్షలు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3.06 లక్షలు సమకూరిందని దేవస్థానం తెలిపింది. 20,451 లడ్డూలను విక్రయించామని పేర్కొంది. ఆరు లడ్డూల ప్యాకింగ్ ద్వారా 53,706 లడ్డూలను విక్రయించామని, దీని ద్వారా రూ.8.95 లక్షలు ఆదాయం వచ్చిందని, పరోక్ష కుంకుమార్చన ద్వారా రూ.24వేలు, సరస్వతీ అలంకారం రోజున పరోక్ష కుంకుమార్చన కోసం ముగ్గురు బుక్ చేసుకోగా రూ.15వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమం ద్వారా రూ.52వేలు, పరోక్ష ప్రత్యేక శ్రీచక్రార్చన ద్వారా రూ.69వేలు, పరోక్ష ఖడ్గమాల్యారన ద్వారా రూ.17,348లు, పుస్తకాలు, క్యాలెండర్ల ద్వారా రూ.1,780లు, విరాళాలు, తదితరాల ద్వారా రూ.2,17,640 సమకూరిందని పేర్కొంది.

బార్లపూడిలో జస్టిస్ కిరణ్మయి దంపతుల పూజలు



పూజల్లో పాల్గొన్న జస్టిస్ కిరణ్మయి దంపతులు

కూచిపూడి, అక్టోబరు 5: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి దంపతులు శనివారం మొవ్వ మండలం బార్లపూడిలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవ పూజల్లో పాల్గొన్నారు. మొవ్వ న్యాయస్థానం ఇన్‌చార్జ్ పి.మేరి స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్త కోనేరు మంజునాథ్ పర్యవేక్షణలో అర్చ కులు దీవి రామ కృష్ణమాచార్యులు, వెంకటేశ్వరకుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరు యువకుల దుర్మరణం..మరో బాలుడికి స్వల్పగాయాలు.. వెల్లంకిలో విషాదఛాయలు



ధన్వంత్ (ఫైల్)



ఫణికుమార్ (ఫైల్)

వీరులపాడు, అక్టోబరు 5: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి ధన్వంత్(19), అచ్చి ఫణికుమార్(20), షేక్ ఇమ్రాన్(16) స్నేహితులు. కంచికచర్ల మండలం పరిటాలలో వ్యక్తిగత పనుల నిమిత్తం ముగ్గురు ఒకే బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అప్పుడే పొలం పని ముగించుకుని రహదారిపైకి వచ్చి ఆగిన ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టారు. దీంతో ధన్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఫణికుమార్ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఇమ్రాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బెంగళూరులో మొదటి ఏడాది ఇంజనీరింగ్ చదువుతున్న ధన్వంత్ దసరా సెలవులకు ఇంటి వచ్చి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. శనివారం పోస్టుమార్టం అనంతరం గ్రామంలోకి రెండు మృతదేహాలు రావడంతో వెల్లంకిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మచిలీపట్నం సుందరీకరణకు ప్రణాళికలు



ప్రణాళికలు సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులకు సూచిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్‌లో సుందరీకరణ పనులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మునిసిపల్ అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, తుపానులు సంభవించిన సమయంలో నగరంలో ముంపు నివారణకోసం నలుమూలల పంప్‌హౌస్‌లు నిర్మించి, నీటిని బయటకు పంపింగ్ చేసేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. చెత్త సేకరణకు అంచనాలను రూపొందించి తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు ప్రణాళికను తయారుచేయాలన్నారు. కమిషనర్ బాపిరాజు, జిల్లా పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ మధుసూధనరావు పాల్గొన్నారు.

క్షయరహిత జిల్లాగా కృష్ణాను తీర్చిదిద్దుదాం

- పీహెచ్‌సీ వైద్యులకు డీఎంహెచ్‌వో గీతాబాయి పిలుపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5: కృష్ణాజిల్లాను క్షయ, కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్య సేవలపై శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సమావేశపు హాలులో జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. కుష్టుతో బాధపడుతున్న వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలందించాలని సూచించారు. డాక్టర్ ఎ.వెంకట్రావు, డాక్టర్ వేణుగోపాలకృష్ణ, బి.రామారావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

- అధిష్ఠానం ఆదేశాలు పాటిద్దాం.. టీడీపీ విస్సన్నపేట మండల నాయకులతో దేవదత్



విస్సన్నపేట మండలం నాయకులతో టీడీపీ తిరువూరు ఇన్‌చార్జి శావల దేవదత్

తిరువూరు, అక్టోబరు 5: 'టీడీపీ అధిష్ఠానం సూచనల మేరకు సమన్వంతో పనిచేద్దాం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూద్దాం. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటా, ఎవరికి ఏ పని ఉన్నా ముందుండి చేయిస్తా'. అని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ హామీ ఇచ్చారు. శనివారం విస్సన్నపేట మండలంలోని పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ కార్ల ర్యాలీతో పట్టణంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి తరలివచ్చారు. పార్టీ బాధ్యతలు స్వీకరించిన దేవదత్‌ను అభినందించారు. తొలుత కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆ మండలం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ విస్సన్నపేట మండల నాయకులు నెక్కళపు వెంకటేశ్వరరావు, బడా శ్రీను, కవులూరి రాజా, ఆకుల రాధాకృష్ణ, మట్ట వేణు, ఆ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అంతరాలయ దర్శనం ఆగదా..?

(ఐదో పేజీ తరువాయి)

పడుతున్నారు. ఈ క్యూలో వెళ్తే త్వరగా దర్శనమవుతుందని భక్తులు టికెట్లు తీసుకుంటున్నారు. అంతరాలయ దర్శనాల కారణంగా రూ.500 క్యూ నెమ్మదిగా కదులుతోంది. మిగతా క్యూలన్నీ వేగంగా వెళ్తున్నాయి. శరన్నవరాత్రుల్లో అంతరాలయం దర్శనాలు రద్దు చేసినప్పటికీ ప్రొటోకాల్ జాబితాలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులను అంతరాలయంలోకి తీసుకెళ్తున్నారు. కొంతమంది ఆలయం వెనుక ఉన్న వీవీఐపీ క్యూ నుంచి ప్రధానాలయం ద్వారం వద్దకు వచ్చి పక్కనే నిలబడిపోతున్నారు. విధులు నిర్వర్తించే ఎవరో ఒకరు వచ్చి అక్కడున్న చిన్నగేటు తాళాలు తీయిస్తున్నారు. వారు అంతరాలయంలోకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఇక్కడ ఇబ్బంది ఏర్పడుతోంది. అప్పటి వరకు కదిలిన క్యూ ఆగిపోతోంది.

దర్శనం కాక భక్తుల ఇక్కట్లు

అంతరాలయంలోకి వెళ్లినవారు ఒకపక్కగా నిలబడి దర్శనాలు చేసుకోవడం లేదు. అమ్మవారికి ఎదురుగా నిలబడుతుండటంతో బయట రూ.500 భక్తులకు దర్శనం కలగట్లేదు. అక్కడ ఉన్న సెక్యూరిటీ కూడా లోపల ఉన్నవారిని కదిలించకుండా, క్యూల్లో ఉన్నవారిపైనే ప్రతాపం చూపిస్తున్నారు. దీనిపై భక్తులు మండిపడుతున్నారు. రెండు రోజుల క్రితం కొంతమంది మహిళలు ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని క్యూల కంటే రూ.500 క్యూ నెమ్మదిగా కదులుతోందని అధికారులే అంగీకరించారు. వీవీఐపీలకు దర్శనాలు చేయించేందుకు ఆలయానికి ప్రొటోకాల్ విభాగం ఉంది. ఈ విభాగంతో సంబంధం లేకుండా కొంతమంది అంతరాలయ దర్శనాలు చేయిస్తున్నారు. ఇందుకు డబ్బులు బాగానే ముడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. అలాగే, వీవీఐపీల దర్శనాల కోసం ఉదయం 9-11, మధ్యాహ్నం 2-4 గంటల మధ్య స్లాట్ ఇచ్చారు. ఈ స్లాట్‌లు లేని సమయాల్లోనూ వీవీఐపీలు దర్శనాలకు వస్తుండటంతో ఆ ప్రభావం రూ.500 క్యూపై పడుతోంది.

రూల్స్ మాకేనా..మీకుండవా?

- పోలీసులను ప్రశ్నించిన దేవదాయశాఖ ఉద్యోగులు

లబ్బీపేట, అక్టోబరు 5: రూల్స్ మాకేనా.. మీకుండవా అంటూ పోలీసులను దేవదాయ శాఖ ఉద్యోగులు ప్రశ్నించిన ఘటన శనివారం కొండపైన జరిగింది. కొండపైన డోనర్ సెల్ సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం వైపు నుంచి దర్శనానికి వీవీఐపీలను పంపాల్సి రావడంతో బారికేడ్ల పక్కనే దేవదాయశాఖ ఉద్యోగులను ఉంచి ఎవరు ఎంతమందిని దర్శనానికి తీసుకువెళుతున్నారో పుస్తకంలో నమోదు చేస్తున్నారు. శనివారం రాత్రి 8గంటల సమయంలో ఓ పోలీసు అధికారి దాదాపు 10మందిని తీసుకెళుతుండగా ఇదేం తీరని దేవదాయ ఉద్యోగులు ప్రశ్నించారు. నమోదు చేయకుండా అధికారిని పంపిన పోలీసులను నిలదీశారు. అక్కడకు వచ్చిన ఏసీపీ రవికిరణ్ సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

శక్తిపటాల ఊరేగింపు కొట్లాట కేసులో

17 మందికి రిమాండ్

- వారిలో 13 మంది గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5: బలరామునిపేటలో గురువారం తెల్లవారుజామున శక్తిపటాల ఊరేగింపు సందర్భంగా జరిగిన కొట్లాట కేసులో 17 మందిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు పంపారు. డీఎస్పీ సుభాని, ఆర్‌పేట సీఐ ఏసుబాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. శక్తిపటాల ఊరేగింపు జరుగుతున్నప్పుడు పాత తగాదాల నేపథ్యంలో బడుగు త్రినాథ్, జొన్నలగడ్డ వరప్రసాద్, దొంతు పృధ్వీరాజ్‌లపై 17 మంది దాడి చేశారు. వారిలో బడుగు త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సంగతి విదితమే. దాడిలో పాల్గొన్న వెన్నా మోహన్, మణికంఠ, కొల్లా శివ, కొల్లా సాయి, వెన్నా జగన్, పీర్ రాక్స్‌తో పాటు మరో 11 మందిని ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హత్యాయత్నం కేసు కింద నమోదు చేసి 17 మందిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు పంపారు. వారిలో గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థులు 13 మంది ఉండటంతో పోలీసుస్టేషన్ వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శక్తిపటాల ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని, మద్యం తాగి కొందరు ఊరేగింపులో పాల్గొం టున్నట్టు ఫిర్యా దులు అందుతున్నాయని, కఠిన చర్యలు తప్ప వని డీఎస్పీ, సీఐ హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

నిత్యావసర సరుకులు, దుస్తుల పంపిణీ



పాతరాజరాజేశ్వరి పేట, అక్టోబరు 5: పాతరాజరాజేశ్వరి పేటలోని ఊర్దూ పాఠశాలలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఎస్‌జేసీ మెమోరియల్ ఫౌండేషన్ హుబ్లీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హుబ్లీ పట్టణ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ కలకుంట్ల స్వర్ణ, ఫౌండేషన్ సభ్యులు లాజరస్ అబ్రహం, డేవిడ్‌లు 1000 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

నాల్గో డివిజన్‌లో దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, అక్టోబరు 5: కరోనా సమయంలోనే కాకుండా ఇటీవల వచ్చిన వరదల సమయంలో పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు.

తూర్పు పరిధిలోని నాల్గో డివిజన్ శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ రెండో రోడ్లో పారిశుధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా కాలనీ పెద్దలు చలసాని సుబ్బారావు అందించిన నూతన దుస్తులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలసాని సుబ్బారావు ఆధ్వర్యంలో నాల్గో డివిజన్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు భోజనాలు పెట్టి నూతన దుస్తులను అందచేయడం అభినందనీయ న్నారు. కరోనా సమయంలో అందరూ ఇంటికి పరిమితం అయ్యారన్నారు. పారిశుధ్య కార్మికులు మాత్రం రహదారులను శుభ్రం చేస్తూ విధులు నిర్వహించారని తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పారిశుధ్య కార్మికుల సంక్షేమం, శ్రేయస్సు కోరుకుంటామన్నారు. కార్మికుల జీతాల పెంపు అంశంపై ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివ రావు, మిక్కిలినేని బుజ్జి, కోనేరు జగదీష్, అక్కినేని రమేష్, జావా మల్లికార్జునరావు, కోనేరు రాజబాబు, కొసరాజు పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించండి

కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, అక్టోబరు 5: రాష్ట్ర నలుమూలల నుంచి దుర్గమ్మను దర్శించుకునేందుకు నగరానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరానికి వచ్చే భక్తులకు పారిశుధ్య సమస్యలతోపాటు, తాగునీరు, ఇతరత్రా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, రోజురోజుకి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున దానికి తగిన విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న వారం రోజుల్లో భక్తులకు ఎటువంటి సదుపాయాలు కల్పించాలనే దానిపై అధికారులతో చర్చించారు. నూతనంగా నగరానికి వచ్చిన సూపరింటెండెంట్ ఇంజనీర్లు స్వయంగా ఫీల్డ్‌లో వెళ్లి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజనీరు ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, ఎస్ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, డీఎంహెచ్‌వో రామ్మోహన్ ఎస్టేట్ ఆఫీసర్ టీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

దర్శనానికి వచ్చే భక్తులకు మంచినీటిని నిరంతరాయంగా అందించేలా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. దుర్గగుడి క్యూలైన్లతోపాటు కొండ చుట్టు భక్తులకు మంచినీటిని అందించాలని ఆదేశించారు. దసరా సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరును అందించడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం పున్నమిఘాట్, భవానీఘాట్‌లలో ఉన్న తాత్కాలిక మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో



త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు



మొగల్రాజపురం ధనకొండ అమ్మవారు



శ్రీ శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో



కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో



దత్తపీఠం గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో



దర్శిపేటలోని రాజరాజేశ్వరి అమ్మవారు



గాయత్రీదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకారంలో విజయదుర్గా అమ్మవారు



గంగానమ్మ దేవాలయంలో మంగళగౌరి అమ్మవారు







సిద్ధార్థనగర్‌లోని సిద్ధార్థ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో చండీహోమంలో పాల్గొన్న భక్తులు, అన్నపూర్ణాదేవిగా అమ్మవారు, చంద్రఘంటాదేవిగా అమ్మవారు

కేబీఎన్‌లో కొనసాగుతున్న దసరా పూజలు

వన్‌టౌన్, అక్టోబరు 5: కేబీఎన్ కళాశాల ఆవరణలోని దాసాంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో లోకకళ్యాణార్థం నిర్వహిస్తున్న దసరా పూజా కార్యక్రమాలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ప్రత్యేక వైదిక కార్యక్రమాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిస్తున్నారు. మూల మంత్ర జపాలు, హోమాలు కొనసాగుతున్నాయి. 108 మంది చండీయాగంలో పాల్గొన్నారు. మరో 108 మంది కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. వివిధ దేవతల పేరిట హోమాలను నిర్వహిస్తున్నారు. కళాశాల యాజమాన్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అన్నపూర్ణ రూపంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

● పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్‌ఈ డేటా సైన్స్ డిపార్టుమెంట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం దసరా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలకు చిట్టా విజయశ్రీ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. దుర్గమాత వివిధ రూపాలను విద్యార్థినులు ప్రత్యేక వస్త్రధారణతో ముస్తాబై వీక్షకులను అలరించారు. ప్రామాణికత, సృజనాత్మకత, తదితరాలను మూల్యాంకనం చేసి విజేతలను నిర్ణయించారు. రంగవల్లులు, పాటల పోటీలు నిర్వహించారు. రంగోళిలో అమ్మవారి రూపాలను అందంగా తీర్చి దిద్దారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

● భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం భ్రమరాంబ అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈవో పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు ఆర్.సుమంత్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు చేశారు.

● వన్‌టౌన్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రాము అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.







పొట్టి శ్రీరాములు కాలేజీలో విద్యార్థినుల పూజలు, వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, పాత శివాలయంలో

ఎల్ఈపీఎల్ సర్వీసు రోడ్డులో తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్



పటమట, అక్టోబరు 5 : నిర్మలా స్కూల్ జంక్షన్ కుడివైపున పునీత పాల్ కథెడ్రల్ నుంచి ఎల్ఈపీఎల్ మల్టీప్లెక్స్ థియేటర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో తరచూ ట్రాఫిక్ స్తంభించి పోతోంది. ఈ మార్గంలో యాక్సిస్ బ్యాంకు దగ్గర రోడ్డుకు రెండు వైపులా ద్విచక్ర వాహనాలు, కార్లు ఆపి ఆ బ్యాంకు వినియోగదారులు బ్యాంకులోకి వెళ్లి తమ పనులు చక్కబెట్టుకుని వస్తున్నారు. దీంతో రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

అబద్ధాల పోటీలో నెంబర్‌వన్ జగన్

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, అక్టోబరు 5: అబద్ధాల పోటీలో మాజీ సీఎం జగన్ నెంబర్ వన్‌గా నిలుస్తాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తిరుమల లడ్డూ విషయంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై ప్రజలు, భక్తులు స్వాగతిస్తున్నారన్నారు. సిట్‌ను సుప్రీం కోర్టు మరింత బలోపేతం చేసిందన్నారు. నెయ్యి కల్తీపై సీబీఐ విచారణ కావాలన్న జగన్ నేడు సిట్టు లేదు.. బిట్టు లేదంటూ చేసిన వ్యాఖ్యలే తప్పు జరిగిందనడానికి నిదర్శనమన్నారు. అబద్ధాల జగన్ రెడ్డి ఏరేంజ్‌లో కథ నడిపించాడో దీన్ని బట్టి అర్థమవుతోందన్నారు. దేవస్థానం బోర్డులో జగన్ తన బంధువులనే ఎక్కువ నియమించుకున్నారన్నారు. లడ్డూ ప్రసాదం కల్తీ కేసులో జగన్‌రెడ్డి పతనం మొదలైందన్నారు. శ్రీవాణి ట్రస్ట్ పేరుతో వ్యాపారం చేశారన్నారు.

కేపీ రావుకు మాతృ వియోగం

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 5: ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేపీ రావుకు మాతృ వియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కొడాలి నాగమణి (86) అనారోగ్యంతో శనివారం గురునానక్ కాలనీలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. కేపీ రావు ఆమెకు చిన్నకుమారుడు. నాగమణి భౌతికకాయానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బాయ్ ఉపాధ్యక్షుడు పున్నయ్య చౌదరి, ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, క్రీడా సంఘాల ప్రతినిధులు బి శివరామ్, సుగుణరావు, ధనియాల నాగరాజు నివాళులర్పించి, కేపీ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కొడాలి నాగమణి (ఫైల్ ఫొటో)

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలి

విస్సన్నపేట, అక్టోబరు 5: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి అన్నారు.

విస్సన్నపేట పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రమేష్, కె.సీతారామరాజు, డాక్టర్ సుధీర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లాజరస్ పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బకాయి వేతనాలు చెల్లించాలి

వరద బాధితులకు గోర్తి సత్యవతి ట్రస్ట్ వితరణ



గవర్నర్‌పేట, అక్టోబరు 5 : గోర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గోర్తి శ్రీనివాస చక్రవర్తి వరదల వల్ల సర్వం కోల్పోయిన 50 పేద కుటుంబాలకు నెలరోజులకు సరిపడా సరుకులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ సంకే విశ్వనాథం, గోర్తి లత, గణేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ముఠా కార్మికుడు మృతి


వన్‌టౌన్, అక్టోబరు 5: గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముఠా కార్మికుడు తాతా వెంకట లక్ష్మణ్ (24) శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లి సీతానగర్‌కు చెందిన తాతా వెంకట లక్ష్మణ్ విజయవాడ వన్‌టౌన్‌లో ముఠా పనులు చేస్తున్నాడు. ఇతను ఈనెల 3న మధ్యాహ్నం గవర్నర్‌పేట నవరంగ్ థియేటర్ సమీపంలో తన బైక్‌ను రిపేరు చేయించుకుని ఇంటికి బయలుదేరాడు. సీతమ్మవారి పాదాల వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ లక్ష్మణ్‌ను స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు 5వ నెంబరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతుడికి ఏడాది క్రితం వివాహమైంది.

టీడీపీ నేత పిళ్లా మృతి



చిట్టినగర్, అక్టోబరు 5: టీడీపీ నేత పిళ్లా వెంకటరమణ శనివారం హఠన్మరణం చెందారు. వెంకటరమణ బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈయన సోదరుడు పిళ్లా శ్రీను నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కోశాధికారిగా ఉన్నారు. ఆదివారం ఉదయం వెంకట రమణ అంతిమయాత్ర ఉంటుందని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

మిక్ ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ గుర్తింపు



కంచికచర్ల, అక్టోబరు 5: మిక్ ఇంజనీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఏ ప్లస్ గుర్తింపు లభించింది. సెప్టెంబరులో ముగ్గురు నిపుణులతో కూడిన బృందం కళాశాలలో నాణ్యతా ప్రమాణాలపై తనిఖీ నిర్వహించింది. మౌలిక, విద్యాప్రమాణాలు, నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ తదితర అంశాలను పరిశీలించిన నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతకు ముందు మిక్ కళాశాలకు నాక్ ఏ గుర్తింపు లభించగా, ప్రస్తుతం ఏ ప్లస్ లభించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవాహిని కాలేజీలో బతుకమ్మ సంబరాలు

తిరువూరు, అక్టోబరు 5: దసర ఉత్సవాల్లో భాగంగా మహిళలు బతుకమ్మ ఆట సందడి చేశారు. శనివారం శ్రీవాహిని ఇంజనీరింగ్ విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో బతుకమ్మలను రూపొందించి, ఆటపాటలతో సందడి చేశారు.



వాగ్దేవి కళాశాలలో..

జగ్గయ్యపేట: పట్టణంలో వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థినులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ బుస్సా సరిత, ఆకడమిక్ డైరెక్టర్ జ్వలిత్ సాయి, ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 235 మంది హాజరు

తిరువూరు, అక్టోబరు 5: పట్టణంలోని వాహిని ఇంజనీరింగ్ కాలేజీలో టెట్ పరీక్షలు శనివారం నిర్వహించారు. ఉదయం 150 మంది విద్యార్థులకుగాను 125 మంది, మధ్యాహ్నం 150 మందికిగాను 110 మంది హాజరయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

నేడు పవర్ కట్

విస్సన్నపేట: విస్సన్నపేట బస్టాండ్ సెంటర్ నుంచి నూజివీడు రోడ్డు, సత్తుపల్లి రోడ్లలో ఈనెల 6న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కె.విజయ్‌భాస్కర్ శనివారం తెలిపారు.

10 వాలీబాల్ టోర్నీ

విస్సన్నపేట: తెల్లదేవరపల్లి తండాలో ఈనెల 10, 11 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9666759386లో సంప్రదించాలన్నారు.

అమ్మకు భక్తనీరాజనం

గాయత్రీదేవిగా రేణుకపరమేశ్వరి



జగ్గయ్యపేట, అక్టోబరు 5: పట్టణంలోని రేణుక పరమేశ్వరీ అమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మహి ళలు కుంకుమపూజ నిర్వహించారు. మహాలక్ష్మీ అమ్మవారి వెండి దేవాల యంలో అన్నపూర్ణదేవిగా అలంకారం చేశారు. నకాసిబజార్ కనకదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహించారు.

బంగారపు మంగళసూత్రాలు

దుర్గాపురం దుర్గాదేవికి పట్టణానికి చెందిన కోమటి సురేష్, ఝాన్సీ దంపతులు రూ.11వేలు విలువచేసే బంగారు మంగళ సూత్రాలను అందజేశారు.

అన్నపూర్ణాదేవిగా భవానీ




జగ్గయ్యపేట రూరల్: ముక్త్యాలలో భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో భవానీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో సురేష్‌బాబు పర్యవేక్షణలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా శుకశ్యామలాంబ



నందిగామ: రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారిని గాయత్రీదేవి అలంకారం చేశారు. వాసవీ మాతకు, మరిడీమహాలక్ష్మి అమ్మవార్లకు అన్నపూర్ణాదేవి అలంకారం చేశారు.

గాయత్రీదేవిగా సత్యమ్మ



నందిగామ రూరల్ : అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ, గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో హరిగోపీనాథ్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో కుంకుమార్చనలు నిర్వహించారు. పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో కనకదుర్గ, కనకమహాలక్ష్మీ, జ్ఞానసరస్వతీ అమ్మవార్లు అన్నపూర్ణా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి



కంచికచర్ల రూరల్: కంచికచర్లలోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు




ఇబ్రహీంపట్నం: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు శనివారం కొండపల్లిలోని శ్రీలక్ష్మి బొడ్డురాయి మార్కెట్ సెంటర్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కొటికలపూడిలో అన్నదానం

కొటికలపూడిలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులకు మాలిక్ ఫ్రెండ్ సర్కిల్ అన్నదానం చేశారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ



తిరువూరు: శాంతి నగర్‌లోని ఆలయంలో దుర్గమ్మను గాయత్రీదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సర్దార్ పేటబాపయ్య కూరగాయల మార్కెట్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

రెడ్డిగూడెం: మండలంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

అన్నపూర్ణదేవిగా కనకదుర్గమ్మ



గంపలగూడెం: గంపలగూడెం రామాలయంలో కనకదుర్గమ్మ, అన్నపూర్ణ దేవిగా, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలోని గజలక్ష్మి, నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి, ధైర్యలక్ష్మిగా, ఊటుకూరు కోదండరామాలయంలోని రాజ్యలక్ష్మి, ధాన్యలక్ష్మిగా దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవిగా తిరుపతమ్మ



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోకేశ్‌కు రుణపడి ఉంటాం

- పసికందు ప్రాణం కాపాడిన మంత్రి ప్రజాదర్బార్
- ఆంధ్రా హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం
- యువనేతకు తల్లిదండ్రుల కృతజ్ఞతలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసికందు

జగ్గయ్యపేట, అక్టోబరు 5: 14 రోజుల పసికందు.. ప్లేట్‌లెట్లు పడిపోయి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు. ఆ తల్లిదండ్రులు తమ వద్దనున్న కొద్దిపాటి డబ్బు గ్రామంలోని ఆస్పత్రిలోనే ఖర్చు అయింది. దేవుడా.. అంటూ విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఖరీదైన వైద్యం చేయించలేని దయనీయ స్థితి ఒకవైపు.. కన్నబిడ్డకు ముంచుకొస్తున్న మృత్యువు మరోవైపు.. ఎటూ పాలుపోని ఆ సమయంలో మంత్రి నారా లోకేశ్ ఆ తల్లిదండ్రులకు అండగా నిలిచారు. క్షణాల్లో స్పందించి బిడ్డ ప్రాణాలు నిలిచేలా చేశారు. దీంతో 'మీరు చేసిన సాయం మర్చిపోలేం. జన్మజన్మలకు రుణపడి ఉంటాం' అంటూ తల్లిదండ్రులు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జగ్గయ్యపేట సత్యనారాయణపురానికి చెందిన గిరి జన కుటుంబానికి చెందిన ప్రైవేటు చిరుద్యోగి చదల మహేశ్ తన బిడ్డ ప్రాణాలను మంత్రి నారా లోకేశ్ నిలిపిన వైనాన్ని మీడియాకు వివ రించారు. మహేష్ భార్య లక్ష్మి సెప్టెంబరు 14న రెండో సంతానంగా మగ శిశువుకు జన్మనిచ్చింది. బేబి 4కేజీల బరువుతో ఆరోగ్యంగా జన్మించాడు. అయితే 14 రోజులకు బాబు రాత్రిళ్లు ఏడుస్తూ ఉండటం, పాలు తాగక పోవటంతో పట్టణంలోని చిన్నపిల్లల ఆస్పత్రికి, తర్వాత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా రక్తకణాలు పడిపోయాయని వైద్యులు చెప్పారు. మెరుగైన వైద్యంకోసం విజయవాడకు తీసుకెళ్లాలని సూచించారు. విజయవాడ ఆంధ్రా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, చికిత్సకు భారీగా ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అంత డబ్బు లేదని తెలుసుకున్న న్యాయవాది, స్నేహితుడు మహేంద్ర ఇచ్చిన సూచనతో బాలుడి తండ్రి మహేశ్ గత నెల 27అర్ధరాత్రి ఉండవల్లిలోని నారా లోకేశ్ నివాసం వద్దకు వెళ్లి ఉదయం వరకు వేచిచూశాడు. అప్పటికే ప్రజా దర్బార్‌కు 400 మంది తమ అర్జీలతో సిద్ధంగా ఉన్నారు. అప్పుడే శిశువుకు ప్లేట్‌లెట్స్ మరింత తగ్గాయని ఆస్పత్రి నుంచి ఫోన్ రావటంలో ఆందోళన చెందిన మహేశ్.. 5 నిమిషాల్లో తన బిడ్డ చనిపోతాడంటూ పరిస్థితిని మిగతా అర్జీదారులకు, భద్రతా సిబ్బందికి వివరించాడు. ఆ తర్వాత లోకేశ్ ఓఎస్‌డీని, అక్కడ నుంచి మంత్రి లోకేశ్‌ను కలవడం వెంట వెంటనే జరిగిపోయాయి. బిడ్డ తండ్రి ఆవేదన విన్న లోకేశ్.. ఎంత ఖర్చైనా ఆపసికందుకు చికిత్స చేయించమని వెంటనే కలెక్టర్, పీఏస్‌కు ఆదేశాలు జారీచేశారు. తక్షణం ఆస్పత్రి యాజమాన్యానికి ఫోన్‌లో చెప్పటంతో చికిత్స ప్రారంభించారు. బాబు ఆరోగ్యం శనివారానికి కుదుట పడిందని, ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడని మహేశ్ ఆంధ్రజ్యోతికి చెప్పారు. మంత్రి నారా లోకేశ్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటామని బిడ్డ తల్లిదండ్రులు అన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో యువతకు ఉపాధి

విస్సన్నపేట, అక్టోబరు 5: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి అన్నారు. విస్సన్నపేట పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రమేష్, కె.సీతారామరాజు, డాక్టర్ సుధీర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లాజరస్ పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బకాయి వేతనాలు చెల్లించాలి

వేతన బకాయిలు చెల్లించాలి : ఐద్వా

విస్సన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో వంటపని చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఐద్వా నాయకురాలు పి.అరుణ డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. కె.లక్ష్మి, నూర్జహాన్, మేకల లూతియా, గౌషియాబేగం, మారయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జగ్గయ్యపేట: గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు, తాత్వికులు చిట్టా లక్ష్మీనరసింహాశాస్త్రి జన్మదినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థిని విద్య కోసం రూ.5వేలు అందజేశారు. ఏపీఎంపీపీఏ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్, కార్యదర్శి గడ్డం రాంబాబు, కోశాధికారి వై. రాకేష్, బి.రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

జి.కొండూరు : దసరా పండుగ సందర్భంగా జి.కొండూరు కాలనీలో ఉన్న పేదలకు తెలుగు మహిళా మాజీ అధ్యక్షురాలు పెదగమళ్ల పద్మావతి శనివారం దుస్తులను పంపిణీ చేశారు. జి.కొండూరు బీసీసెల్ జిల్లా మాజీ కార్యదర్శి, జి.కొండూరు లక్ష్మీనరసింహ, చెన్నకేశవస్వామి దేవస్థానం, కోదండ రామాలయం మాజీ చైర్మన్ పెద్దగమళ్ల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు ఎంపీయూపీ పాఠశాలలో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు చింతల వెంకటసీతారామయ్య తెలిపారు. ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ కార్డియాలజీకి సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల గోడు



ఎమ్మెల్యే సౌమ్యకు వినతిపత్రాల అందజేత

కంచికచర్ల రూరల్, అక్టోబరు 5: టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పలువురు అర్జీలను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అందజేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న తన షాపుల్లో బంగారం చోరీ జరిగి ఆరు నెలలు పూర్తయినా, కేసు దర్యాప్తులో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని నగల దుకాణం జయమాని సురేష్ కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పోలీసుల అధికారులతో దర్యాప్తుచేసి, నిందితులతోపాటు సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోగంటి బాబు, గుత్తా ఓంకార్, గుదే నరేష్, జి.రమేష్, మూరకొండ ఏడుకొండలు, షేక్ షబ్బీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి

ఎ.కొండూరు, అక్టోబరు 5 : ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. కంభంపాడు నయారా పెట్రోల్ బంక్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కంచికచర్ల మండలం దొనబండకు చెందిన షేక్ అబ్దుల్లా మృతి చెందినట్టు ఎస్సై కృష్ణ తెలిపారు. మృతిడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై యువకుడి అత్యాచారం?

విజయవాడ: జగ్గయ్యపేటలో మైనర్ (12)పై పొరుగున నివాసం ఉండే యువకుడు లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం బాలికపై దాడి జరగ్గా, బాలిక బంధువులు గుర్తించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు పంపి, కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

పేకాట శిబిరంపై దాడి

విస్సన్నపేట: విస్సన్నపేట శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.3,120 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.రామకృష్ణ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

విశిష్ట విద్యా సేవా పురస్కారాల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



శ్రీరాం బదరీ నారాయణకు ఉత్తమ విద్యావేత్త పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

జగ్గయ్యపేట, అక్టోబరు 5: ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు. పట్టణంలో బీ-కన్వెన్షన్ హాలులో శనివారం నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశిష్ట విద్యా సేవా పురస్కారాల పంపిణీలో కృష్ణా- గుంటూరు జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించటం ప్రశంసనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో 15 మంది ఉత్తమ విద్యావేత్తలను, జిల్లాస్థాయిలో 21 మందిని, నియోజక వర్గస్థాయిలో 73 మందిని సత్కరించారు. నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ కాలేషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.మోహనరావు, అధ్యక్షుడు సబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి తెల్లగూటి రవిబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మల్లెల శ్రీనివాసరావు, ఎస్ఎన్‌బీ చారి, ఎంఈవోలు ఎల్.చిట్టి బాబు, ఎల్. నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత

పట్టణంలో ధనంబోడుకు చెందిన రామిశెట్టి వెంకటకృష్ణ అనే డయాలసిస్ రోగికి సీఎం సహాయనిధి నుంచి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సిఫార్సుతో మంజూరైన రూ.1.50లక్షలను శనివారం తన నివాసంలో అందజేశారు.